ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 13 సెప్టెంబరు 2024

ఆరంభంలోనే ఆటంకం


మినీ టెక్స్‌టైల్ పార్కుకోసం ప్రతిపాదించిన స్థలం

- మినీ టెక్స్‌టైల్ పార్కుకు గ్రహణం
- కొడకండ్లలో ఏర్పాటు చేయని వైనం..
- గత ప్రభుత్వంలో శంకుస్థాపన స్థల సేకరణ
- ఉపాధి కోసం ఎదురుచూస్తున్న పవర్‌లూమ్ కార్మికులు, నిరుద్యోగులు
- ఎమ్మెల్యే చొరవ చూపాలని వేడుకోలు
- పార్కు ఏర్పాటైతే మారనున్న మండల స్వరూపం

కొడకండ్ల, సెప్టెంబరు 12: కొడకండ్లలో మరమగ్గాల కార్మికులు ఎక్కువగా ఉండడం.. మారుమూల ప్రాంతం కావడంతో గత ప్రభుత్వం మినీటెక్స్‌టైల్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. మండలకేంద్రంలో స్థానిక కార్మికులు, నిపుణుల ఉపాధి కోసం గతప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న మినీ టెక్స్‌టైల్ పార్కు పరిస్థితి ఒక్క అడుగు ముందుకు పడితే మూడు అడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది. గత ఏడాది అక్టోబరు 8న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మినీ టెక్స్‌టైల్ పార్కుకోసం శంకుస్థాపన చేయడంతో స్థానిక కార్మికులు, చిన్న యూనిట్‌ల యజమానుల ఆశలు ఒక్కసారిగా చిగురించాయి. అంతకుముందు టెక్స్‌టైల్ పార్కుకు కావాల్సిన భూమి సేకరణ ఆగిపోవడంతో కార్మికులలో మొలకెత్తిన అనుమానాలు శంకుస్థాపనతో పటాపంచలయ్యాయి. సుమారు 61 కోట్లతో నిర్మాణం జరుప తలపెట్టిన ఈ పార్కుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా కనీసం 5 వేలమందికి లబ్ధి చేకూరుతుందని హర్షం వ్యక్తం చేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, జౌళి శాఖ మాజీ మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ శాఖ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు సైతం చేశారు. కానీ ప్రభుత్వం మారడంతో కొత్తప్రభుత్వంలోని పెద్దలు ఆ ఊసే ఎత్తకపోతుండడంతో స్థానిక కార్మికులు, నిపుణలు, నిరుద్యోగులు, చిన్న యూనిట్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మినీ టెక్స్‌టైల్ పార్కుకు మొత్తం 70 ఎకరాల భూమి అవసరం

మినీ టెక్స్‌టైల్ పార్కుకు 70 ఎకరాల భూమి అవసరమని సంబంధిత అధికారులు నిర్ణయించారు. అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక శ్రద్ధ పెట్టి చొరవ చూపడంతో అప్పటి జనగామ కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య, టీఎస్‌ఐఐసీ శాఖ, రెవెన్యూ, సర్వే అధికారులు గతంలో స్థల పరిశీలన చేశారు. అనంతరం టీఎస్‌ఐఐసీ సంస్థకు కొడకండ్ల - రామవరం మెయిన్ రోడ్డుపైన ఉన్న 9 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూశాఖ అప్పగించింది. మిగతా భూసేకరణ కోసం పయత్నించగా చుట్టుపక్కల ప్రైవేటు భూ యజమానులు స్థలం ఇవ్వడానికి సుముఖత చూపలేదు. దాంతో మొగుళ్ళచెరువు గుట్ట వద్ద ఉన్న 54 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వడానికి రెవెన్యూశాఖ సంసిద్ధత వ్యక్తం చేసింది. దాంతో మొదట కేటాయించిన 9 ఎకరాల 28 గుంటల భూమిలో మొదటి ఫేజ్, మిగతా భూమిలో రెండో ఫేజ్ మినీటెక్స్‌టైల్ పార్కును నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇదంతా గత ప్రభుత్వం ఉన్నపుడు తీసుకున్న నిర్ణయాలు కానీ ప్రస్తుతం ప్రభుత్వం మారింది. పాలకుర్తి నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా యశస్వినిరెడ్డి గెలిచింది. ఏ పార్టీ గెలిచినా ఈ ప్రాంతానికి మేలు జరిగే పనులు ముందుకు సాగాలని ప్రజలు కోరు కుంటున్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరవ చూపి మినీ టెక్స్‌టైల్ పార్కు పనులు త్వరగా జరిగేలా చూసి ఉపాధి కల్పించాలని నిరుద్యోగులు, కార్మికులు, చిన్న యూనిట్ల యజమా నులు విజ్ఞప్తి చేస్తున్నారు.


మాజీ మంత్రి దయాకర్‌రావు గతంలో ఆవిష్కరించిన మినీ టెక్స్‌టైల్ పార్కు శిలాఫలకం(ఫైల్)

మాకు పని దొరుకుతుంది..: దాసరి పల్లవి, యూనిట్ యజమాని, కొడకండ్ల



మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన జరగడ ంతో మాకు పని దొరుకుతుందని న మ్మకం కలిగింది. ప్రభుత్వం మారింది. ఎమ్మెల్యే యశశ్వినీ రెడ్డి చొరవ చూపి త్వరగా పనులు మొదలు పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటైతే ప్రత్యక్షంగా మాలాంటి చిన్న యూనిట్ యజమానులు, కార్మికులకు, నిపుణులకు పరోక్షంగా మా దగ్గర వస్త్రాలు కొని అమ్ముకునే వాళ్ళకు, ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారులకు పరోక్షంగా జీవనోపాధి కలుగుతుంది.

ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు..


- పసునూరి మధుసూదన్, పద్మశాలి నేత, కొడకండ్ల

గతప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చొరవ చూపడంతో సుమారు 61 కోట్ల నిధులతో మినీ టెక్స్‌టైల్ పార్కును 2 ఫేజ్‌లలో కొడకండ్లలో నిర్మాణం చేయాలని నిశ్చయించి శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. ఈ మినీ టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే కొడకండ్ల మండలమేకాక చుట్టుపక్కల మండలాల ప్రజలకు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. ఇప్పుడు గెలిచిన స్థానిక ఎమ్మెల్యే యశశ్వినీరెడ్డిని మండల పద్మశాలీ పెద్దలతో కలువగా ఆమె సానుకూలంగా స్పందించారు.

నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

గణనాథుడిని దర్శించుకున్న స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం


ఇప్పగూడెంలో వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 12: వినాయకుడి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని కోరుతూ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని రంగరాయగూడెం, ఇప్పగూడెం గ్రామాల్లో గురువారం రాత్రి వినాయక మండపాలను కడియం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన రెండు గ్రామాల్లో మహా అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో చవితికి ముందే రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురిసి గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి అలుగు పడ్డాయని తెలిపారు.కార్యక్రమంలో రైసు మిల్లర్స్ అసోసి యేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మందపురం ఎల్లాగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర రెడ్డి, కత్తుల కట్టయ్య, తోట వెంకన్న, అజయ్‌రెడ్డి, అరుట్ల సందీప్ రెడ్డి, రాజశే ఖర్ రెడ్డి, గొడుగు రాజు, దాసరి రాజు, దైద ఎలిషన్ పాల్గొన్నారు.

మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 12: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులపాటు సెలువులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మార్కెట్ యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం వినాయక నిమజ్జనం సెలవు, మంగళవారం ఈద్ మిలాద్ నబీ పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు. బుధవారం నుంచి మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాని తెలిపారు.

కడవెండి యాదిలో ఏచూరి

2022 సెప్టెంబరు 17న దేవరుప్పుల ప్రాంతానికి రాక

దేవరుప్పుల, సెప్టెంబరు 12: తెలంగాణ విమోచన దినం సందర్భంగా అమరులను స్మరించుకోడానికి 2022 సెప్టెంబరు 17న జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి, కామారెడ్డిగూడేనికి సీపీఎం జాతీయ కార్యదర్శి హోదాలో సీతారాం ఏచూరి వచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం వద్ద, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు షేక్ బందగీ స్మారక స్థూపం వద్ద ఆయన ఘన నివాళులర్పించారు. అదే విధంగా కడవెండిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. చరిత్రను బీజేపీ ప్రభుత్వం వక్రీకరిస్తుదంటూ ఆయన విమర్శలు గుప్పించారు. ఆయన మరణించిన సందర్భంగా కడవెండి, కామారెడ్డిగూడానికి చెందిన ప్రజలు గుర్తు చేసుకున్నారు.


కడవెండిలో దొడ్డి కొమురయ్య స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీతారాం ఏచూరి(ఫైల్)

రైళ్ల హాల్టింగ్ పొడిగింపు

శాతవాహన, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ సూఫర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్ ఆరు ఆరునెలలు

గిర్మాజీపేట, సెప్టెంబరు 12: ప్రస్తుతం చర్లపల్లి, మహబూబాబాద్, జమ్మికుంట, మంచిర్యాల్ రైల్వేస్టేషన్‌లలో కొనసాగుతున్న కొన్ని రైళ్ల తాత్కాలిక హాల్టింగ్‌లను ప్రయాణికుల సౌకర్యార్థం మరో ఆరునెలలు పొడిగిస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి ఎశ్రీధర్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా విజయవాడ -సికింద్రాబాద్ శాతాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు- సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సిరిపూర్‌కాగజ్‌నగర్ -సికింద్రాబాద్ ఇంటర్‌సిటీలు చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం నుంచి యథావిధిగా మరో ఆరునెలల పాటు ఆగుతాయని తెలిపారు. అలాగే మహబూబాబాద్‌లో నర్సాపూర్ -నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్, జమ్మికుంటలో సికింద్రాబాద్-ధానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి, మంచిర్యాలలో పుణే-కాజీపేట వీక్లి ఎక్స్‌ప్రెస్ ఈనెల 20నుంచి యథావిధిగా మరో ఆరునెలఉ ఆగుతాయని పేర్కొంది.

మక్కలు క్వింటా రూ.3,090


మక్కలు అమ్మిన రైతు తిరుపతి

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 12: వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో గురువారం మొక్కజొన్నలకు మరింత ధర పెరిగింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన పెండ్లి తిరుపతి 66బస్తాల మక్కలు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకురాగ సదా ట్రేడర్స్ నిర్వాహకుడు సదానందం క్వింటా రూ.3,090 చొప్పున కొనుగోలు చేశారు. వారం రోజుల క్రితం క్వింటా రూ.3,070 పలుకగా మార్కెట్ చరిత్రలో అదే రికార్డు ధరగా నిలిచింది. తాజాగా మరో రూ.20 అదనంగా పెరగడం విశేషం.

ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, సెప్టెంబరు 12: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. ఈ నెల 17న జరగబోయే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లును పూర్తి చేయాలని వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ ఏసీపీ పార్థసారథి, డీసీఎస్‌వో సర స్వతి, డీఎం సీఎస్ హాతీరాం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అన్నారు. గురువారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ పీహెచ్‌సీ, చౌడారంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, రేషన్ షాపు, సఖీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది 24 గంటలకు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఔషద నిల్వలు ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, ఆసుపత్రిని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆశావర్కర్లతో ఇంటింటా సర్వే చేసి జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి రక్త పరీక్షలు చేసి చికిత్స అందించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం సదుపాయం కల్పించాలన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితా లు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువుల ధరల పట్టికలను ఖచ్చితంగా ప్రదర్శించాలని తెలిపారు. ప్రజలకు ఎట్టి పరిస్థితిలో అసౌకర్యం కలిగించరాదని సూచించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలకు సఖి కేంద్ర నిర్వాహకులు అండగా నిలుస్తూ వారికి ధైర్యం చెప్పాలని తెలిపారు.

ఓటరు జాబితాను జీపీ కార్యాలయాల్లో ప్రదర్శించాలి: కలెక్టర్

ఓటర్ల తుది ముసాయిదా జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి గురువారం కలెక్టర్ గ్రామ పంచాయతీ ఓటర్ల తుది జాబితా రూపకల్పన, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 281 గ్రామ పంచాయతీ పరిధిలో 2576 వార్డుల్లో ఉన్నాయని ఇందులో భాగంగా 2,02,981 పురుషుల ఓటర్లు, 2,06,573 మహిళ ఓటర్లు మొత్తం 4,09,558 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటర్ల జాబితాపై 14 నుండి 21 వరకు అభ్యంతరాలను స్వీకరించడం జరుగుతుందన్నారు. 18న అఖిల పక్ష నాయకులతో సమావేశం, 26 లోపు మార్పులు చేర్పులు తొలగింపులు చేపట్టి 28న తుది జాబితాను గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ధరణీ, మీసేవ అప్లికేషన్లను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు ప్రతీ మంగళవారం రేషన్ షాపులను విజిట్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా పారిశుద్య నిర్వహణలో భాగంగా ప్రతి గ్రామంలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! నా క్లయింట్ అగు చల్లా అశోక్ వర్ధన్ రెడ్డి, తండ్రి : కీ॥శే॥ మల్లారెడ్డి, వయస్సు : 58 సం॥లు, వృత్తి : న్యాయవాది, నివాసము : జనగామ గ్రామము, మండలము, జిల్లా [illegible] నా క్లయింట్ అగు చల్లా అశోక్ వర్ధన్ రెడ్డి, తండ్రి : కీ॥శే॥ మల్లారెడ్డిగారు, ఇంటి నెంబరు 2-1-56 గలది, గజములు 161-20 చదరపుగజాలు కలది, దీనికి సరియగు హద్దులు : తూర్పు : మున్సిపల్ రోడ్డు, పడమర : మహమ్మద్ యూసుఫ్ గారి ఇల్లు, ఉత్తరం : విజయ్ కుమార్ బజాజ్ గారి ఇల్లు, దక్షిణం : [illegible] ప్రిన్సిపల్ [illegible] సివిల్ జడ్జి గారి కోర్టు వరంగల్ ఓ.ఎస్.నెం.307/2024 దావాలో [illegible] రూ॥ 15,79,945/- [illegible] కావున ఇట్టి పేపరు ప్రకటన సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఇట్టి ఇంటిని ఎవరైన కొనుటకు గాని మరియు తనఖా పెట్టుకొనుటకు ఎవరైనా ముందుకు వచ్చినచో నా యొక్క క్లయింటు తీసుకోబోయే చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ కేసులకు బాధ్యులు అగుదురు. [illegible] ఇంటి నెంబరు 2-1-56 గలది, 161-20 చదరపు గజముల [illegible] వారి యొక్క కూతురు [illegible] గారి నుండి గాని ఎలాంటి లావాదేవీలు కొనడము మరియు కుదువపెట్టు కోవడము లాంటి చేయకూడదని సమస్త ప్రజలకు, ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాను.

తేది : 10-09-2024

సం/- దండెబోయిన యుగంధర్ అడ్వకేట్, జనగామ, సెల్ : 9440205918

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


హనుమాన్ దేవాలయం నుంచి వెల్దండ రోడ్డు వరకు గుంతలు, గుంతలుగా ఉన్న సీసీ రోడ్డు

నర్మెట, సెప్టెంబరు 12 : గత పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత వల్ల నర్మెట మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధాన కూడళ్లలో ఉన్న సీసీ రోడ్లపై బైక్‌పై ప్రయాణం చేస్తే కొత్త రోగం కొని తెచ్చుకోవాల్సిందే. సీసీరోడ్లపై అడుగడుగునా గుంతలు పడి కంకర తేలడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయితీ కార్యాలయం నుంచి ఉన్నత పాఠశాల వరకు, హనుమాన్ టెంపుల్ నుంచి వెల్దండ రోడ్డు వరకు సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. మజీద్‌గడ్డ వద్ద రోడ్డుపై కంకర తేలి ఇబ్బందికరంగా మారాయి. సీసీరోడ్ల కంటే మట్టి రోడ్లు నయమని ప్రజలు అంటున్నారు. ప్రతిరోజు ఈ రోడ్లపై నడిచి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని సీసీ రోడ్లు ఎండోస్తే దుమ్ము, వానోస్తే బురుద మయంగా మారుతున్నాయి. ప్రజలు మెయిన్ రోడ్డుకు వెళ్లాలంటే ఈ దారుల గుండానే వెళ్లాలి. దీంతో వాహనదారులు, పాదాచారులు నడుము, కాళ్ల నొప్పులు ఫ్రీగా పొందుతూ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సైతం పూర్తిగా అధ్వానంగా ఉండడంతో వీధుల్లో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు వార్డుల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉన్న గ్రామ పంచాయితీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అధికారులు పట్టించుకొని ప్రజల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నత పాఠశాల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎన్నికల ముందు శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ వస్తుందని ఆగమాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి గత ఏప్రిల్ నెలలో శంకుస్థాపన చేశారు. అయిన ఇప్పటి వరకు సీసీ రోడ్డు నిర్మించడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన చేసిన సీసీ రోడ్లను వెంటనే నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


మండలకేంద్రంలోని ఎల్లమ్మ బజార్‌లో కంకర తేలిన సీసీ రోడ్డు

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 12: గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొర్రెకుంట ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పేకాట శిబిరంపై దాడి చేశారు. 10 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి రూ.20 వేల నగదు, ఐదు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న 10మందిలో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం గీసుగొండ పోలీసులకు అప్పగించారు. ఆరుగురు పరారయ్యారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

నేడు నిట్‌లో ఫార్మా ఏఐ సదస్సు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12: కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)ఆధ్వర్యంలో ఫ్యూచర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ పేరుతో ఫార్మా ఏఐ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నిట్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సులో సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి.ప్రదీప్ ప్రారంభోపన్యాసం ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండలో ఫార్మారంగం భవిష్యత్తును చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో 6డీ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ తాళ్లూరి, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ ఎ.శ్రీకాంత్, డిప్యూటీ డైరెక్టర్ జి.రాంధన్, డాక్టర్ రెడ్డీస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి తదితరులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధితో పాటు జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.సత్యశారద తదితరులు పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సు సాయంత్రం 4.30 గంటల వరకు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

దళితులను బహిష్కరించడం దుర్మార్గం

వడ్డెపల్లి, సెప్టెంబరు 12: మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం గోతోజీగూడెం గ్రామంలో డప్పు కొట్టలేదని దళితుడు పంచమి శంకరయ్యతోపాటు కుటుంబ సభ్యులను గ్రామ బహిష్కరణ చేయడం దుర్మార్గమని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్దన్ మాదిగ అన్నారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఎంహెచ్‌డీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకరయ్య చిన్న కుమారుడు జేఎన్‌టీయూలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న కారణంగానే కక్ష కట్టి అగ్రవర్ణ ఆధిపత్య భావజాలం కలిగిన గ్రామ పెద్దలు గ్రామ బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీ, ఎమ్మెల్యే, ఎంపీలు శంకరయ్య కుటుంబానికి అండగా నిలవాలని ఎలుకటి జనార్దన్ మాదిగ కోరారు. ఎంహెచ్‌డీ రాష్ట్ర, జిల్లా నాయకులు రమేష్, రాజేష్, రాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

వర్సిటీ భూముల్లో నివాసితులకు చుక్కెదురు

- హైకోర్టు మెట్లెక్కిన 9 మంది కాలనీవాసులు
- స్టేకు నిరాకరించిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12 : కాకతీయ యూనివర్సిటీ సర్వే నెంబరు 229లో నివాసముంటున్న 9మందితో పాటు మరికొందరు రాష్ట్ర హైకోర్టు మెట్లెక్కారు. కొన్నేళ్లుగా సర్వే నెంబర్ 229లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న నేపథ్యంలో వర్సిటీ అధ్యాపకుల సంఘం, వర్సిటీ విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర విద్యాశాఖాధికారులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేశాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల నేతృత్వంలో రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ప్రత్యేక సర్వే చేపట్టింది. వర్సిటీలోని అన్ని సర్వే నెంబర్లలో సర్వే చేపట్టి భూ కబ్జాలను తేల్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా రెండురోజులుగా వర్సిటీలోని బీసీ కాలనీలో అధికారులు సర్వే చేపట్టారు. సర్వేలో బీసీకాలనీకి చెందిన భవనాలు, అంతర్గత ప్రధాన రహదారి సైతం వర్సిటీ భూముల్లోనే ఉందని రూఢీ అయింది. దీంతో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కబ్జాల్లోకి వచ్చిన వారిపై చట్టరీత్యా చర్యలకు ఉపక్రమించారు.

హైకోర్టులో..

జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీ సర్వేలతో వర్సిటీ భూముల వివరాలన్నీ పక్కాగా లెక్కలు తేల్చేపనిలో ఉండగా, 229 సర్వే నెంబర్‌తో పాటు గుండ్లసింగారం, కుమార్‌పల్లి సర్వేనెంబర్ల పరిధిలోని తొమ్మిది మంది గతంలో రాష్ట్ర హైకోర్టు తలుపులు తట్టారు. గతంలో వేసిన పిటిషన్ సెప్టెంబరు 12న గురువారం విచారణకు వచ్చింది. వర్సిటీ భూకబ్జాదారులు తరుపున న్యాయవాది స్టే ఇవ్వాలని కోరడంతో హైకోర్టు స్టేకు నిరాకరించింది. మునిసిపల్ అధికారులు నోటీసు ఇచ్చారని, కూల్చివేతలకు పాల్పడే అవకాశం ఉందని కోర్టుకు తెలుపడంతో కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే మునిసిపల్ అధికారులు తదుపరి చర్యలు తీసుకునే ముందు భూకబ్జా, అక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిచ్చిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులు చట్టానికి అనుగుణంగా ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని హైకోర్టు అభిప్రాయాన్ని వెల్లడించింది. కాగా, కోర్టు మెట్లెక్కిన వర్సిటీ కాలనీలకు హైకోర్టు తాజాతీర్పులో ఊరట లభించకపోవడంతో వర్సిటీ భూముల చెర వీడనుంది. వర్సిటీ భూముల కబ్జాలకు పాల్పడిన వారిలో ఆందోళన మొదలైంది. కబ్జాలు తెలిన తక్షణమే కూల్చివేతలు చేపడుతామని ఇప్పటికే మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. కాగా, హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా ఉందని హైకోర్టుకు వెళ్లిన బాధితులు చేబుతున్నారు.

నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

మడికొండ, సెప్టెంబరు 12: మరణానంతరం నేత్ర దానంతో ఇద్దరు అంధులకు కంటిచూపు చేకూరుతుందని తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొన్ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన బిల్ల ధర్మారెడ్డి (55) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి ముందుకొచ్చారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి డాక్టర్ లక్ష్మణ్ ద్వారా నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 : నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయుటు శ్రీరాములు అన్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థి బానోత్ గణేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ బేస్‌బాల్ పోటీల్లో గణేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా గణేష్ రాణిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మందుల పద్మ, ఉపాధ్యాయులు రవి, రవికుమార్, ప్రేమ్‌కుమార్, ఉమారాణి, కృష్ణ, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, శ్రీలత పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌సీ కోర్సుల డబ్బులపై విచారణ జరపాలి

- కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు కిరణ్‌గౌడ్



మాట్లాడుతున్న పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 12: కేయూ ఎస్ఎఫ్‌సీ కోర్సులకు చెందిన రూ. 40 కోట్లు అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంతో వెంటనే విచారణ జరపాలని కేయూ పార్టుటైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కేయూ క్యాంపస్‌లోని క్యాంటీన్ ఎదుట ఏర్పాటు చేసిన పార్టుటైం అధ్యాపకుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోల్తి కిరణ్ గౌడ్ హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లోని వీసీ, రిజిస్ట్రార్‌లు రూ.40కోట్లు దారి మళ్లించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఐదేళ్లకోసారి ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ రెగ్యులర్ కోర్సులుగా అప్‌గ్రేడ్ చేయాలనే నిబంధనలున్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 15ఏళ్లు దాటినా ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయడం లేదన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు చేపట్టిన ఎస్ఎఫ్‌సీ కోర్సులన్నీ డబ్బులన్నీ తిరిగి ఆయా కోర్సులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేయూ పార్టుటైం అసోషియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌కుమార్, సలహాదారులు కృష్ణ సుమంత్, శ్యాంసుందర్‌చారి, రజనీకాంత్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు టీఎస్ఎస్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫులెయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ చైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా పీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. పీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

అమరుల ఆశయాల సాధనకు పాటుపడుదాం..


కొడవటూరులో అమరులకు నివాళులు అర్పిస్తున్న నేతలు

బచ్చన్నపేట సెప్టెంబరు 12: అణగారిన వర్గాల ప్రజల కోసం పోరాటాలు చేసి అమరులైన వారిని స్మరించుకోవాల్సి బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సీపీఎం మండల కార్యదర్శి మెల్లంకొండ వెంకటేశ్ అన్నారు. గురువారం మండలంలోని కొడవటూరు గ్రామంలో మినలాపురం ఎల్లయ్య నేతృత్వంలో పతాకావిష్కరణ చేసి మృతి చెందిన గంగం సిద్ధారెడ్డి, వేములవాడ వీరయ్య, గాజుల మల్లేశం, మల్లం లక్ష్మీనారాయణలకు నివాళులు అర్పించారు. తెలంగాణా ప్రాంతంలో దొరలు, భూస్వాముల వద్ద నుంచి భూములు గుంజుకుని పేదలకు పంచిన ఉద్యమంలో అనేక మంది అమరులయ్యారని వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఎం పార్టీ నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మినలాపురం మల్లయ్య, ఆగమల్లయ్య, నరేష్, మణెమ్మ, పోచమ్మ, అంజమ్మ, పార్వతమ్మ, కవిత, నిర్మల, సులోచన, గట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



జనగామలో గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు , పుట్టలమ్మ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 12: డివిజన్ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. వినాయక నిమజ్జనం చేసే డివిజన్ కేంద్రంలోని పుట్టలమ్మ చెరువును ఆర్డీవో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ కేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిమజ్జనాలు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతవరణంలో నిమజ్జనాలు జరిగేలా సంబంధిత సిబ్బంది ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తాటికొండ, కొత్తపల్లి, ఛాగల్, రాఘవపూర్ గ్రామాల నుంచి వినాయక నిమజ్జనాలకు తీసుకువచ్చే విగ్రహాలను తాటికొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి క్రాస్ చేసే క్రమంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా పోలీస్ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాలను నిమజ్జనానికి ముందస్తుగానే తెప్పలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. భారీ విగ్రహాలు వచ్చే క్రమంలో క్రేన్స్ అందుబాటులో ఉండేలా సమకూ ర్చుకోవాలన్నారు. రహదారి పై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా భారీ కేడ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవసర మనుకుంటే గజఈతగాళ్ల ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వాహనాలు వచ్చి వెళ్లేలా తగు ఏర్పాట్లు సమకూర్చుకోవాలని సూచించారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో నిమజ్జన ఏర్పాట్లు జరుగాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ సీఐ జి.వేణు, ఎంపీవో నర్సింగరావు, ఇరిగేషన్ ఏఈ యాసర్, ఆర్‌ఐ రవీందర్, సెక్రటరీలు సత్యనారాయణ, చుక్క లింగయ్య, విద్యుత్ ఏఈ చంద్రమోహన్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనాలు షురూ ..

జనగామ కల్చరల్ : జిల్లాలో గణేష్ నిమజ్జనాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 7న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణేష్ నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం మండపాల నిర్వాహకులు నిమజ్జనోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఈ సంవత్సరం అధిక సంఖ్యలో గణేష్ మండపాలు ఏర్పాటు చేశారు. ఏ గల్లీలో చూసినా కనీసం 10 గణేష్ మండపాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 11న ఐదవ రోజును పురస్కరించుకొని అధిక సంఖ్యలో మండపాల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు నిమజ్జన కేంద్రాలను గుర్తించిన అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఎక్కువగా నెల్లుట్ల చెరువులో గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేయనున్నందున అధికారికంగా ఇక్కడ ఏర్పాట్లకు సమాయత్తమయ్యారు. జనగామ - సూర్యాపేట రహదారి నుంచి నెల్లుట్ల చెరువు లోకి జేసీబీ సహాయంతో రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు గణేష్ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. జై గణేష్ మహరాజ్‌కీ జై అంటూ విద్యార్థులు నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలివెళ్లారు.

ఓర్వలేకనే దిగజారుడు రాజకీయాలు

జనగామ రూరల్, సెప్టెంబరు 12: రాహుల్‌గాంధీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ నేతలు ఓర్వలేక దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఒక ప్రకటన ద్వారా మండిపడ్డారు. రాహుల్ గాంధీ అమెరికాలో ఓ సమావేశంలో మాట్లాడిన వ్యాఖ్యలను బీజేపీ నాయకులు అనుకువగా చేసుకోని భారతదేశ ప్రతిష్ఠను భ్రష్టు పాటిస్తున్నారని ఆరోపించడం సరైనదికాదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. గాంధీ కుటుంబంలో ఇప్పటి వరకు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం వరి ప్రాణాలను అర్పించారే తప్ప ఏనాడు కూడా వారి స్వలాభం కోసం పనిచేయలేదన్నారు. బీజేపీ నేతలు దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టడం తప్ప దేశానికి ఒరగబెట్టిందేమి లేదని పేర్కొన్నారు.

తీగారంలో పోషణ మాసోత్సవాలు

జఫర్‌గడ్, సెప్టెంబరు 12 : మండలంలోని తీగారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా కేంద్రంలో పిల్లలకు అందించే పోషకాహారం, ఆరోగ్య రక్షణ, ఎదుగుదల, ఆట పాటలతో పిల్లలకు చదువు నేర్పించడం వంటి అంశాలపై ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనిత అవగాహన కల్పించారు. ప్రీ ప్రైమరీ తరగతి పిల్లలకు చదవడంపై అవగాహన కల్పించేందుకు అంకితబావంతో కృషి చేస్తామని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఇందిర, ఆయా మణెమ్మ, ఆశ వర్కర్లు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గడ్, సెప్టెంబరు 12 : మండలంలోని తీగారంలో ఇటీవల మృతి చెందిన ఉద్దమూరి ప్రభాకర్ కుటుంబాన్ని గురువారం నాయీ బ్రాహ్మణ సంఘం ప్రతినిదులు పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబీకులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాముల నవీన్, వర్కింగ్ ప్రసిడెంట్ తిప్పారపు యోగేశ్వర్, పెద్ద సత్తయ్య, వెంకటాంనర్సయ్య, కుమార్, స్వామి, శ్యాం, సతీష్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుడి మృతి

బచ్చన్నపేట, సెప్టెంబరు 12: మండలంలోని పోచన్నపేట గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పనిచేస్తున్న పడిగం ఆగయ్య(45) గురువారం మృతి చెందాడు. ఆగయ్యకు నివాసముండే ఇళ్లు కూలిపోవడంతో ఉదయం గ్రామంలో పనిచేసి, రాత్రి వేళ జీపీలోనే పడుకుంటాడని స్థానికులు తెలిపారు. బుధవారం రాత్రి నిద్రించి తెల్లవారే సరికి మృతి చెంది ఉన్నాడని, కుటుంబ కలహాల మూలంగా భార్య ఆగయ్యతో కలిసి ఉండడం లేదని తెలిపారు. అంత్యక్రియల కోసం రూ. 10 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ అందించారు. ఆగయ్య మృతి పట్ల మాజీ ఎంపీటీసీ మామిడి అరుణ ఐలయ్య, సర్పంచ్ గట్టు మంజుల మల్లేశం, జీపీ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు తేలుకంటి మురళి, గ్రామ నాయకులు గూడ సిద్ధారెడ్డి, కంసాని మహేందర్‌రెడ్డి, జూకంటి కిష్టయ్య, ఎండీ ఫిరోజ్ తదితరులు సంతాపం తెలిపారు.

ఎవరు మారాలి షార్ట్ ఫిలీం చిత్రీకరణ

జనగామ కల్చరల్, సెప్టెంబరు 12: కల్చరల్ క్రియేటివ్ ఛానల్ ఆధ్వర్యంలో 'ఎవరు మారాలి' షార్ట్ ఫిలీం చిత్రీకరణ జనగామ పట్టణ పరిసర ప్రాంతాలలో జరిగింది. గురువారం జరిగిన ఈ చిత్రీకరణ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటరు నిర్ణయం పై ప్రధానంగా ఈ లఘుచిత్రంలో పలు అంశాలు చర్చించి ప్రజలకు చైతన్యం, అవగాహన కలిగిస్తాయన్నారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అయిలా సోమనర్సింహచారి కాగా డీఓపీ, ఎడిటింగ్ శ్రీకాంత్ నాయక్, సమన్వయకర్త జి.కృష్ణ, నటీనటులుగా అయిలా సోమబ్రహ్మచారి, లగిశెట్టి ప్రభాకర్, దీగోజు నర్సింహచారి, దీగోజు సాంబయ్య, బత్తోజు సిద్దిరాములు, గంగాభవాణి, బుదారపు లావణ్య పని చేశారు.

లో వోల్టేజీ సమస్యపై రైతుల నిరసన


విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

పాలకుర్తి, సెప్టెంబరు 12 : లోవోల్టేజీ సమస్యను పకిష్కరించాని డిమాండ్ చేస్తూ జనగామ జిల్లా పాలకుర్తిలో మల్లంపల్లి, కొండాపురం గ్రామాలకు చెందిన 30 మంది రైతులు ధర్నాక దిగారు. గురువారం పాలకుర్తి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వారానికి రెండు సార్లు ట్రాన్స్‌ఫార్మర్లు లోవోల్టేజీ సమస్య వల్ల కాలిపోతున్నాయని దీంతో వరి పంటలు ఎండుతున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా మల్లంపల్లి గ్రామంలో లోవోల్టేజీ సమస్య వల్లనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నయని, దీంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో మోటర్లు కాలిపోతుండడంతో ఆర్థికంగా చితికిపోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు ఉరుమడ్ల రాజన్న, వెంకన్న, మదన్, బానోతు రవి, సురేందర్, వెంకన్న, రమేష్ తదితరులు ఉన్నారు.

బమ్మెరలో పోతన ఉద్భవ దినోత్సవం


పోతన విగ్రహానికి పూలమాల వేస్తున్న కవులు, గ్రామస్తులు

పాలకుర్తి, సెప్టెంబరు 12 : మండలంలోని బమ్మెర గ్రామంలో పోతన ఉద్భవ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోతన సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో పోతన విగ్రహానికి పూలమాలలు వేసి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చరిత్ర పరిశోధకుడు, ఆధ్యాత్మిక వేత్త కే. వీ. జీ. కృష్ణమూర్తి హాజరై మాట్లాడారు. పోతన చూపిన భక్తి మార్గాన్ని అనుసరిస్తే ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవడానిక అందరం ఒక్కటై ముందుకు సాగాలని కోరారు. పోతన నడియాడిన ప్రాంతాన్ని పరిరక్షిస్తూ అడుగు జాడల్లో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంకాల సోమయ్య, మాన్యపు భుజేందర్, దేవసాని ఉపేందర్, సోమ అశోక్‌బాబు, జలగం నాగభూషణం, దేవసాని నరేష్, శంకరయ్య, రామ్మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలి

మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి



కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 12: కేంద్ర ప్రభుత్వం తుపాను వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ నాయకులు కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా తెలంగాణలో భారీ వర్షాలు కురియడంతో వరద బీభత్సం వలన పెద్ద ఎత్తున ఆస్తి నష్టం, వేలాది పశువులు, మేకలు, గోర్రెలు కోట్టుకోని పోయాయని, చెరువులు,కుంటలు తెగిపోయి లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. నాయకులందరూ పార్టీలకు అతీతంగా నష్టపోయిన వారిని ఆదుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తుఫాను వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి రూ 10,000 కోట్లనిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పాతురి సుగుణమ్మ, ఆది సాయన్న, మంగళంపల్లి జనార్ధన్, అరుణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలను నిర్లక్ష్యం చేయొద్దు

కొడకండ్ల సెప్టెంబర్ 12 : జ్వరాలను నిర్లక్ష్యం చేయవద్దని జనగాం జిల్లా డీఎం అండ్ హెచ్‌వో డా.రవీందర్‌గౌడ్ అన్నారు. ఆయన జిల్లా సర్వైవలెన్స్ ఆఫీసర్ డా.కె.భాస్కర్‌తో కలిసి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఓపీ, ల్యాబ్, అటెండెన్సు రిజిష్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొడకండ్ల ఆరోగ్యకేంద్రంలో సీబీపీ అనలైజర్ ద్వారా ప్లేట్‌లెట్‌ల పరీక్ష, హిమోగ్లోబిన్ పరీక్ష, వీటితో పాటు ర్యాపిడ్ డెంగీ పరీక్ష, వైడల్ పరీక్షలు, అన్నిరకాల విషజ్వరాల పరీక్షలు నిర్వహిస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్ర భవనం పాతది అవడంతో వర్షాకాలం వర్షపు నీరు లీకవడం, పదేపదే విద్యుత్తు మరమ్మత్తులు వస్తున్నాయని కొత్త భవనం నిర్మించాలని డీఎంహెచ్‌వోకు విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించారు. మండల వైద్యాధికారి డా.హరికృష్ణ, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


నష్కల్‌లో వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

చిలుపూర్, సెప్టెంబరు 12 : గణేశ్ నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని చిలుపూర్ ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ భక్తులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నష్కల్ గ్రామాన్ని సందర్శించిన ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్‌కుమార్ మాట్లాడుతూ, గణేశ్ నిమజ్జనోత్స వాలను రాజకీయ పార్టీలకతీతంగా ప్రతీఒక్కరూ హాజరై ప్రశాంతం గా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్ణకంటి స్వప్న -వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ పాశం శిరీష -సురేశ్, గంటె ఉపేందర్, కానిస్టేబుల్ ఇంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ
అందరి బాధ్యత


దేవస్థానం ఆవరణలో పండ్ల మొక్కలను నాటుతున్న గ్రామస్థులు

చిలుపూర్, సెప్టెంబరు 12 : మొక్కల సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని మాజీ ఎంపీటీసీ తాళ్ళపల్లి సంపత్‌కుమార్, పూజారి యల్లంభట్ల కరుణాకర్‌శర్మ, చిలుపూర్ గుట్ట ఆలయ మాజీ డైరెక్టర్ గజ్జెల దామోదర్ భక్తులకు సూచించారు. గురువారం మండలంలోని చిన్నపెండ్యాల లక్ష్మీనరసింహా స్వామి దేవస్థానం ఆవరణలో 200ల నీడనిచ్చే, పండ్ల మొక్కలను నాటి నీళ్ళు పోశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్, కరుణాకర్ శర్మ, దామోదర్ మాట్లాడుతూ నిత్యం భక్తుల పూజలందుకునే ఆలయ ఆవరణలో చెట్లు లేకపోవడం బాధాకరమన్నారు. భక్తుల సహకారంతో ఆలయానికి వెళ్ళే రోడ్డుకిరువైపులా మొక్కలు నాటామని తెలిపారు. కార్యక్రమంలో తాళ్ళపల్లి క్రాంతికుమార్, ఎర్రోళ్ళ రవి, మహేందర్ రెడ్డి, తాళ్ళపల్లి శ్రీధర్, వెంకటేశ్వర్లు, రాము, సుధాకర్, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయాలి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 12: కమిషరేట్ పరిధిలో గణేష్ నిమజ్జన ప్రదేశాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈనెల 16న ట్రై సిటీస్ పరిధిలో నిర్వహించే గణేష్ నిమజ్జన ప్రదేశాలను వారు పరిశీలిం చారు. గురువారం హనుమకొండలోని సిద్ధేశ్వర గుండం, కాజీపేటలోని బంధం చెరువు, హసన్‌పర్తి చెరువులను సందర్శించారు. నిమజ్జనానికి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లను సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, సిబ్బంది నియామకం, విద్యుత్ ఏర్పాట్లు, బారికేడ్లు, తెప్పల ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వైభవంగా నవరాత్రి ఉత్సవాలు


వినాయక ప్రతిమ వద్ద కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

జఫర్‌గడ్, సెప్టెంబరు 12 : శ్రీగణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వినాయక చవితి పురస్కరించుకుని తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించబడిన వినాయక మండపాల్లో శ్రీగణేషుడికి ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలతో పాటు భజన కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో ప్రతిష్ఠించబడిన వినాయక విగ్రహంవద్ద ఆర్యవైశ్య మహిళలు కుంకుమార్చన పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గడ్, సెప్టెంబరు 12 : మండలంలోని తిమ్మంపేట జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు సాఫ్ట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠ శాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ క్రీడాంశంలో ఎం.జశ్వంత్, ఎల్.చరణ్, టి.నిఖిత, ఎల్.దీపిక, టి.రిషిత అత్యుత్తమ ప్రతిభను కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.శారోని తెలిపారు. ప్రతిభా విద్యార్థులను గురువారం హైస్కూల్‌లో హెచ్‌ఎం శారోని, పాఠశాల శాశ్వత క్రీడా దాత చాడ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. మరింత క్రీడా నైపుణ్యంతో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

రాహుల్‌గాంధీపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 12: భారతదేశ ఔన్నత్యాన్ని దేశ గౌరవాన్ని మంట కలుపుతున్న రాహుల్‌గాంధీపై దేశ ద్రోహం కేసు నమోదు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్‌గౌడ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం బీజేపీ నాయకులు జనగామ ఆర్టీసీ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేసి రాహుల్‌గాంధీ ఫ్లెక్సిని దహనం చేశారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్, అనిల్ మాట్లాడుతూ భారత దేశంలో రాజకీయాల కంటే మత స్వేచ్ఛ పైనే పోరాటం కొనసాగుతుందని రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేయడం సరైనదికాదని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ భారతదేశ సమాజాన్ని విచ్ఛిన్నం చేయాడానికి కుట్రలను పన్నుతున్నాడని ఆరోపించారు. మత హింసను రెచ్చగొట్టేందుకు వ్యాఖ్యలు చేస్తున్న రాహుల్‌గాంధీపై దేశద్రోహం కేసు నమోదు చేయాలన్నారు. 10 ఏండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీల పదోన్నతులకు సంబధించిన రిజర్వేషన్ బిల్లులను ఆమోదించలేదన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్ గౌడ్, కొంతం శ్రీనివాస్, కత్తుల లక్ష్మి, విజయ భాస్కర్, దేవరాయ ఎల్లయ్య, వెంకటరాజ నరసింహరెడ్డి, సంతోష్, గాదె ఉపేందర్, బోళ్ల రాజ్‌కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

హిందీ భాషతో దేశ ఐక్యత


విజయపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 12: దేశ ఐక్యతకు హిందీ భాష ఎంతో దోహదం చేస్తుందని హిందీ ఉపాధ్యాయులు యెనగందుల వజ్రయ్య అన్నారు. గురువారం జనగామ జిల్లా కేంద్ర ంలోని ధర్మకంచ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ విజయపత్ర వితరణోత్సవ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వజ్రయ్య మాట్లాడుతూ దక్షిణ భారత హిందీ ప్రచార సభను జాతిపిత మహాత్మాగాంధీ 1918లో తమిళనాడులో స్థాపించారన్నారు. ఈ సంస్థ ద్వారా దక్షిణ భారత దేశంలో హిందీ ప్రచార, ప్రసార కార్యక్రమాలు జరగడమే కాకుండా వేలాది మంది ఉపాధి పొందుతున్నారన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు వజ్రయ్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రమేశ్, శ్రీనివాసులు, రత్నాక ర్, లక్ష్మి, అనిత, కరుణ, భూపతి, లింగం, ఉపేందర్‌రెడ్డి, నరేందర్, చంద్రకళ, తహేర పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి పోరాటం మరువలేనిది


సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 12: సీతారాం ఏచూరి మరణించడం చాలా బాధకరమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటన ద్వారా అన్నారు. ఏచూరి జేఎన్‌టీయూ విదార్థి నాయకుడిగా ఉండి విద్యార్థుల సమస్యల పట్ల పోరాటం చేశాడన్నారు. పేదల సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేసిన మేధావి సీతారాం ఏచూరి అని, దేశ రాజకీయాల్లో గౌరవస్థానం పొందరన్నారు. మార్పు కోరే యువత ఏచూరిని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు.

● జనగామ రూరల్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరికి గురువారం సీపీఎం నాయకు లు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తావద్ద సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘ నాయకుడిగా క్రియాశీలక పాత్ర పోషించి సీపీఎం యువ నాయకుడిగా ప్రజల సమస్యల పట్ల పోరాటం చేస్తూ పరిష్కరానికి కృషి చేశాడన్నారు. ప్రపంచ మేధావి సీతారాం ఏచూరి అని అటువంటి వ్యక్తి మరణించడం చాలా బాధకమన్నారు. కార్యక్రమంలో జోగు ప్రకాశ్, బొట్ల శేఖర్, విజేందర్, శ్రీనివాస్ దస్తగిరి, లలిత, ధర్మభిక్షం, రజిత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● బచ్చన్నపేట : సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం అణగారిన వర్గాలకు తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ అన్నారు. గురువారం ఏచూరి మరణం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. సమాజ మార్పును కోరే యువతకు ఆయనొక ఆదర్శనీయమని తెలిపారు.

వరద బాధిత కుటుంబాలకు
నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న క్యాథలిక్ క్రైస్తవులు

రఘునాథపల్లి, సెప్టెంబరు 12:ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రకాసితండాలోని 125 వరద బాధిత కుటుంబాలకు రఘునాథపల్లి, కంచనపల్లి, కోమల్ల క్యాథలిక్ చర్చిల పరిధిలోని క్రైస్తవులు నిత్యా వసర సరకులతో పాటు దుస్తులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ గోపు థామస్ రెడ్డి, శివారెడ్డి, గాదె మహేందర్ రెడ్డి, కోళ్ల రవి, తుమ్మ ఆరోగ్య రెడ్డి, రాయప్ప రెడ్డి, బాల్ రెడ్డి, సునీల్ రెడ్డి, పర్వీన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అలెక్స్ రెడ్డి, జ్యానీస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.